క్లుప్తంగా

అట్లూరు ఏఓగా భాస్కర్‌బాబు



అట్లూరు : మండల ఏఓ (అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్)గా ఉప్పుటూరు భాస్కర్ బాబు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఏఓగా విధులు నిర్వహిస్తున్న హరినారాయణ పదోన్నతిపై వెళ్లడంతో పోరుమామిళ్ల మండలం రంగసముద్రం గ్రేడ్–1 పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న భాస్కర్‌బాబు పదోన్నతిపై అట్లూరు ఏఓగా వచ్చారు.

నేడు పునరుత్పత్తి ఫలదీకరణ శిబిరం

ప్రొద్దుటూరు : మండలంలోని తాళ్లమాపురం గ్రామంలో బుధవారం ఉదయం 9 గంటలకు పశువులలో పునరుత్పత్తి ఫలదీకరణ శిబిరం, రైతుల శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్థానిక పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.వైకుంఠరావు తెలిపారు. కార్యక్రామనికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, ఎస్‌వీవీయూ డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ జి.వెంకటనాయుడు, డీడీ డాక్టర్ సి.శారదమ్మ, ఎస్‌వీవీయూ డీన్ ఆఫ్ వెటర్నరీ సైన్సెస్ డాక్టర్ వీరబ్రహ్మయ్య హాజరవుతారని ఆయన వివరించారు. పశుధన్ జాగృతి అభియాన్, భారత ప్రభుత్వ పశుసంవర్ధకశాఖ వారి ఆర్థిక సహాయంతో, శ్రీవెంకటేశ్వర పశు వైద్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తాళ్లమాపురం పరిసర గ్రామాల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రంగస్థల కళాకారుడు జయదేవవర్మ మృతి



జయదేవ వర్మ (ఫైల్)

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణానికి చెందిన ప్రముఖ రంగస్థల నటుడు, కళాకారుడు ఆర్‌వీ జయదేవ వర్మ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఈయన వృత్తి రీత్యా ఉపాధ్యాయుడు, ప్రవృత్తి రీత్యా నాటక కళాకారుడు. 12వ ఏటనే నాటక రంగంలో ప్రవేశించి దాదాపు 3వేల నాటక ప్రదర్శనలు ఇచ్చారు. సత్యహరిశ్చంద్ర, మహిషాసురమర్దిని, పల్నాటి యుద్ధం, మాయాబజార్ తదితర నాటకాలతో జయదేవ వర్మ అందరినీ ఆకట్టుకున్నారు. ఆయన మృతి పట్ల జిల్లా రచయితల సంఘం కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం, నటులు చంద్రశేఖర్ రాజు, కంభం పాములేటి సంతాపం తెలిపారు.

22న దేవాంగ కల్యాణ మండప కమిటీ ఎలక్షన్లు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వినాయక నగర్‌లోని దేవాంగ కల్యాణ మండపంలో ఈ నెల 22న కల్యాణ మండప పాలకవర్గ కమిటీ ఎలక్షన్లను నిర్వహించనున్నట్లు ఎలక్షన్ ఆఫీసర్ ఎంవీ ప్రభాకర రావు ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం కార్యవర్గ సభ్యులు 21 మందికి గాను శాశ్వత గౌరవాధ్యక్షులు (ఆరుగురు)కి ఎన్నిక ఉండదని పేర్కొన్నారు. కార్యనిర్వాహక సభ్యులు 15 మందిని ఎన్నికల ద్వారా ఎన్నుకుంటారన్నారు. గౌరవాధ్యక్షుడు, ఇద్దరు ఉపాధ్యక్షులు, ఒక ప్రధాన కార్యదర్శి, ఇద్దరు సహాయ కార్యదర్శులు, ఒక కోశాధికారి, సహాయ కోశాధికారి, 7 మంది డైరెక్టర్లను ఎన్నుకుంటారన్నారు. కళ్యాణ మండపంలో ఈ నెల 11, 12 తేదీలలో నామినేషన్లు స్వీకరిస్తారని తెలిపారు.

ప్రశ్నించే వారిపై ఎన్‌ఐఏ దాడులు సరికాదు

ప్రొద్దుటూరు : సమస్యలపై మాట్లాడేవారిని, ప్రశ్నించేవారిపై కేంద్ర ప్రభుత్వం ఎన్‌ఐఏచే దాడులు చేయించి ఇబ్బంది పెట్టడం సరికాదని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య, ఏరియా కార్యదర్శి పి.సుబ్బరాయుడు, సహాయ కార్యదర్శి షరీఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక చైతన్య మహిళా సంఘం నాయకురాలు పద్మ తన పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంటే ఎటువంటి ఆధారాలు లేకున్నా సస్పెక్టివ్ అనే నెపంతో ఆమె ఇంటిపై దాడులు చేయడం అన్యాయమని వారు పేర్కొన్నారు. ఈ దాడులు ప్రజాస్వామ్యం దేశంలో ప్రజల గొంతులు వినిపించేవారు లేకుండా చేయడం వంటిదేనని, ఈ చర్యలను సీపీఐ ఖండిస్తున్నట్లు తెలిపారు.

చంద్రబాబు అరెస్టు పబ్లిసిటీకి వినియోగం

ప్రొద్దుటూరు : చంద్రబాబు అరెస్టును కూడా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తన పబ్లిసిటీకి వినియోగించుకున్నాడని 32వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి తెలిపారు. ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ కేవలం వినాయక పండుగకు చందాలు ఇవ్వడానికి ఇష్టం లేకే ప్రవీణ్ తిరుమలకు పాదయాత్ర చేశారని తెలిపారు. నంద్యాలలో చంద్రబాబును అరెస్టు చేస్తారని తెలుసుకుని పబ్లిసిటీ కోసం ఆయన వెంట వెళ్లారన్నారు. చంద్రబాబు అరెస్టు చేస్తే మౌన దీక్షలు చేయకుండా సంతోషంతో ఎగరడం ఏమిటని ప్రశ్నించారు. తన కూతురికి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి కులాంతర వివాహం చేసి ఆదర్శప్రాయుడుగా నిలిచారని, దీనిని కూడా టీడీపీ నాయకులు విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు.

‘జగనన్న ఆరోగ్య సురక్ష’ గొప్ప పథకం

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : ఈ ప్రభుత్వంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన గొప్ప పథకం జగనన్న ఆరోగ్య సురక్ష అని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరాములపేట వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున స్పందన వచ్చింది. ప్రజలు ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ రకాల పరీక్షలు చేయించుకుని వెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో ఇలాంటి పండుగ వాతావరణమే నెలకొని ఉందన్నారు. ఈ రోజు కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైస్ చైర్మన్లు పాతకోట బంగారుమునిరెడ్డి, అయిల్‌మిల్ ఖాజాతోపాటు మొత్తం కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారన్నారు. తన ఆహ్వానం మేరకు గాజుల శివజ్యోతి కూడా హాజరయ్యారని తెలిపారు. వైద్య శిబిరంలో 70 రకాల పరీక్షలు నిర్వహిస్తున్నారని, ప్రత్యేక వైద్య నిపుణులు వైద్య సేవలు అందిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శులు పోరెడ్డి నరసింహారెడ్డి, లక్కిరెడ్డి పవన్‌కుమార్‌రెడ్డి, కౌన్సిలర్ గరిశపాటి లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కామిశెట్టి బాబు, కోఆపరేటివ్ స్టోర్స్ అధ్యక్షురాలు గజ్జల కళావతి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయంలో..

మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంత ప్రజలు పెద్ద ఎత్తున కార్యక్రమానికి హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. పలువురు వైద్యులు వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ శేఖర్ యాదవ్, ఎంపీడీఓ కుళ్లాయమ్మ, జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ కల్లూరు నాగేంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మార్తల ఓబుళరెడ్డి, మాజీ సర్పంచ్ దేవీప్రసాదరెడ్డి, రూరల్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ కళావతి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే రాచమల్లుతో కలసి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో టీడీపీ కౌన్సిలర్ గాజుల శివజ్యోతితో పాటు మొత్తం కౌన్సిలర్లు

నేడు చియ్యపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష

చాపాడు : మండలంలోని చియ్యపాడులో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహిస్తున్నట్లు మండల అభివృద్ధి అధికారి శ్రీధర్‌నాయుడు తెలిపారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాల వద్ద ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ వైద్య శిబిరం నిర్వహించి అన్ని రకాలైన వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కోరారు.

నేడు తోట్లపల్లెలో

బ్రహ్మంగారిమఠం : మండలంలోని తోట్లపల్లె గ్రామంలో బుధవారం ఉదయం 9 గంటలకు డాక్టర్ ఎస్.సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఉంటుందని ఎంపీడీఓ వెంగమునిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు వంకమర్రిలో..

కాశినాయన : మండలంలోని వంకమర్రి ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మైథిలి తెలిపారు. ఈ అవకాశాన్ని సచివాలయం పరిధిలోని గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

నేడు టీ.సంఢ్రపల్లెలో..

గోపవరం : మండలంలోని టీ.సంఢ్రపల్లె సచివాలయంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ తెలిపారు. మంగళవారం జగనన్న సురక్ష కార్యాక్రమానికి సంబంధించి సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో సమీక్ష నిర్వహించారు. వైద్యశిబిరంలో సాధారణ వ్యాధులతోపాటు కంటి వైద్యపరీక్షలు కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు.

పేదల ఆరోగ్యం కోసమే జగనన్న ఆరోగ్య సురక్ష

కలసపాడు : పేద ప్రజల ఆరోగ్యం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుదర్శన్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఎగువ రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 450 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి 15 మందిని మెరుగైన వైద్యం కోసం కడపకు రెఫర్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సూదా రామకృష్ణారెడ్డి, బి.నారాయణ యాదవ్, పురుషోత్తంరెడ్డి, చిత్తా రాజశేఖర్‌రెడ్డి, స్పెషలాఫీసర్ మురళీధర్‌రెడ్డి, ఎంపీడీఓ మహబూబ్ బీ, తహసీల్దారు రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఇంటి వద్దకే వైద్యం ప్రజలకు వరం

పోరుమామిళ్ల : జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా ప్రజలకు ఇంటి వద్దనే వైద్య పరీక్షలు చేసి, చికిత్స అందించడం ప్రజలకు ఓ వరమని జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీ సీఎం బాషా, చెన్ను రాజశేఖర్, ఆప్కాస్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ కళ్యాణ చక్రవర్తి పేర్కొన్నారు. మంగళవారం తిమ్మారెడ్డిపల్లెలో సర్పంచ్ బీరం ఉమ అధ్యక్షతన ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో వారు పాల్గొని మాట్లాడారు. శిబిరంలో వైద్యాధికారులు మేరీ ఏలీషా, నిఖిల్, కళ్యాణ్, భార్గవిలు, ఆరోగ్య విద్యాధికారులు సాధు వెంకటేశ్వర్లు, రఘు వైద్యసిబ్బంది పాల్గొని 150 మందికి పైగా రోగులకు వైద్య సేవలందించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టిక ఆహార పదార్థాల స్టాల్ అందరినీ ఆకర్షించింది. శిబిరంలో ఎంపీడీఓ వరప్రసాదరావు, తహసీల్దారు గంగయ్య, రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అట్లూరు మండలంలో..

అట్లూరు : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు ఆరోగ్యం అందేలా చేస్తున్నారని జిల్లా పశుగణాభివృద్ధి సంఘం చైర్మన్ రొండా మాధవరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనరు ముడమాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని ముత్తుకూరు ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యాక్రమంలో వారు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా ప్రజల ఆరోగ్య సమస్యలను గుర్తించి వారికి అవసరమైన మందులు జబ్బు నయం అయ్యేంత వరకు ప్రభుత్వం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. దీంతో పేద మధ్య తరగతి కుటుంబాలకు ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. వైద్యపరీక్షల అనంతరం వ్యాధిగ్రస్తులకు మందులతో కూడిన కిట్లు అందజేశారు. మండల సచివాలయాల కన్వీనరు మణ్యం మల్లికార్జునరెడ్డి, అందూరు రామకృష్ణారెడ్డి, పొన్నవోలు బ్రహ్మారెడ్డి, తహసీల్దారు వెంకటరమణమ్మ, ఎంపీడీఓ సుజాతమ్మ, వైద్యాధికారులు హమీదాబేగం, హుస్సేన్, జరీనా, హరేంద్రసింగ్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో ఎంతో మేలు

బి.కోడూరు : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు ఎంతో మేలు చేకూరనుందని వైఎస్సార్‌సీపీ కన్వీనర్ రామకృష్ణారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డిలు తెలిపారు. మంగళవారం తుమ్మలపల్లె సచివాలయం పరిధిలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. శిబిరంలో సుమారు 400 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భాస్కర్‌రావు, సర్పంచ్ రామసుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ శేషారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, వైద్యులు మధుసూదన్‌రెడ్డి, నమ్రత తదితరులు పాల్గొన్నారు.



కలసపాడు : ఎగువ రామాపురంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి



అట్లూరు: ముత్తుకూరులో వ్యాధిగ్రస్తులకు మందులను అందజేస్తున్న ప్రజాప్రతినిధులు



పోరుమామిళ్ల: పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న నాయకులు, అధికారులు



బి.కోడూరు : రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

అందరూ ఆరోగ్యంగా ఉండాలి

మైదుకూరు : రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. మంగళవారం మైదుకూరులో, మండలంలోని అన్నలూరులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అన్నలూరులో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో పేదలు డబ్బులేక వైద్యం చేయించుకోలేని స్థితిలో ఉండకూడదనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు. ప్రతి సచివాలయం పరిధిలో ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారన్నారు. శిబిరాల్లో నిపుణులైన వైద్యులతోపాటు పీహెచ్‌సీల నుంచి వైద్యులు, వైద్య సిబ్బంది శిబిరాలకు వచ్చిన రోగులకు పరీక్షలు నిర్వహించి చికిత్స అందిస్తున్నారు. శిబిరంలో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం కింద పరీక్షలు చేయించుకున్న వారికి మంజూరైన కంటి అద్దాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. శిబిరంలో అన్నలూరు సర్పంచ్ ఎం.శ్రీనివాసులరెడ్డి, ఎంపీపీ థామస్, మండల ప్రత్యేక అధికారి, ఏడీఏ కృష్ణమూర్తి, తహసీల్దార్ అనురాధ, ఎంపీడీఓ ఏవీ రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గల్లా నరసింహారెడ్డి, తిప్పిరెడ్డిపల్లె, వనిపెంట సర్పంచ్‌లు నాగేంద్ర, గౌస్ లాజం, ఎంపీటీసీ శీర్ల గంగమ్మ, చంద్రశేఖర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, రామశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శిబిరాన్ని పరిశీలించిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్

మైదుకూరులోని సాయి కల్యాణ మండపంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రమోహన్ పరిశీలించారు. శిబిరంలో మున్సిపల్ కమిషనర్ వై.రంగస్వామి, డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోండి

ఖాజీపేట : జగనన్న సురక్ష పథకంను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ప్రజలను కోరారు. జగనన్న సురక్ష పథకంలో భాగంగా రావులపల్లె గ్రామంలో మెగా వైద్య శిబిరం న్విర్వహించారు. ఎమ్మెల్యే ఈ వైద్యశిబిరం ప్రారంభించారు. రోగులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, ఎంపీపీ అబుబకర్ సిద్ధిక్, అగ్రహారం సొసైటీ అధ్యక్షుడు రాఘవరెడ్డి, సర్పంచ్ శివరామిరెడ్డి, ఎంపీటీసీ కనపర్తి సుబ్బారెడ్డి, సచివాలయాల కన్వీనర్ గోపాల్‌రెడ్డి, ప్రత్యేక అధికారి సుబ్బారావు పాల్గొన్నారు.

ప్రజలందరికీ నాణ్యమైన వైద్యం

చాపాడు : ప్రజలందరికీ నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తోందని మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బద్రిపల్లె గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. 328 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయగా, 6 మందిని మెరుగైన చికిత్సలు అందించేందుకు కార్పొరేట్ ఆసుపత్రులకు రెఫర్ చేశామని మండల వైద్యాధికారి రాజేష్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ లక్షుమయ్య, ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, నాయకులు రామసుబ్బారెడ్డి, ఓబుళరెడ్డి, నరసింహారెడ్డి, సర్పంచ్ మల్లేశ్వరీ, వైద్యాధికారులు శ్రీవాణి, ఉజ్వల, ఈఎన్‌టీ స్పెషలిస్టు శ్రావణ్‌కుమార్, ఆప్తాలమిక్ ఆఫీసర్ తేజ, సీహెచ్ఓ మహాదేవయ్య, ఆరోగ్య విస్తరణాధికారి రాఘవయ్య పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠం : ప్రజలకు మెరుగైన వైద్యం అందాలనే ధృఢ సంకల్పంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం డి.నేలటూరులో జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపులో ఆయన పాల్గొని మాట్లాడారు. రోగులకు ఆరోగ్య కిట్లు పంపిణీ చేశారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ చంద్రహాసన్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి నరసింహారెడ్డి, డాక్టర్ మల్లేష్, సింగల్‌విండో అధ్యక్షుడు సుబ్బారెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



చాపాడు : బద్రిపల్లెలో జగనన్న ఆరోగ్య సురక్షలో మందుల పంపిణీ దృశ్యం



మైదుకూరు : కంటి అద్దాలను అందిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

హక్కుల కోసం పోరాడే వారి ఇళ్లపై దాడులు దారుణం

ప్రొద్దుటూరు కల్చరల్ : అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడే ప్రజాసంఘాల నాయకుల ఇళ్లపై ఎన్‌ఐఏ తదితర సంస్థలు దాడిచేసి సోదాలు చేయడం దారుణమని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా కన్వీనర్ మాదాసు మురళీ, నియోజక వర్గ అధ్యక్షుడు పాణ్యం చిన్నసుబ్బరాయుడు పేర్కొన్నారు. మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ మహిళల, అణగారిన వారి హక్కుల పరిరక్షణ, అభ్యున్నతి కోసం ప్రజాస్వామ్య బద్ధంగా కృషిచేస్తుంటే కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో వారిని, వారి కుటుంబసభ్యులను భయపడేలా దాడిచేసి సోదాలు చేయడం సరికాదన్నారు. చైతన్య మహిళా సంఘం సభ్యురాలు పద్మ ఇంటిపై దాడిచేసి ఆరోగ్యం నిమిత్తం ఉంచుకున్న డబ్బును స్వాధీనం చేసుకోవడం వారిని ఆర్థికంగా, మానసికంగా దెబ్బతీయడమే అన్నారు. ప్రజల సమస్యల కోసం పోరాడే వారికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం ఉపాధ్యక్షుడు మాడిశెట్టి ప్రతాప్, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు సుబ్బరాజు, కోశాధికారి తాటి శ్రీనివాసయాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణయ్యయాదవ్, రమేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

‘ఎందుకు ఆంధ్రకి జగనే కావాలి’ కార్యక్రమం నేడు

కలసపాడు : మండల కేంద్రంలోని చిత్తా మనోహర్ కల్యాణ మండపంలో బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధల ఆధ్వర్యంలో ఎందుకు ఆంధ్రాకి జగనే కావాలి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సుదర్శన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

కలసపాడు : స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం పోరుమామిళ్ల ఫారెస్టు రేంజ్ అధికారి వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో వన్యప్రాణి వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. నేటి పరిస్థితుల్లో అడవి జంతువులు, వాతావరణం, పరిశుభ్రత, నీరు మానవ జీవనానికి ఆధారమన్నారు.

రైతు పథకాలను ప్రచారం చేయండి

పోరుమామిళ్ల : వ్యవసాయ అనుబంధ, ఉద్యాన శాఖ పథకాలు రైతులకు తెలిసే విధంగా గ్రామస్థాయిలో ప్రచారం జరగాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యాన సలహాదారు సంబటూరు ప్రసాదరెడ్డి అధికారులకు, వ్యవసాయ సిబ్బందికి సూచించారు. మంగళవారం పోరుమామిళ్ల మండల కాంప్లెక్స్‌లో ఉన్న రంగసముద్రం ఆర్‌బీకేలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ పశుసంవర్ధకశాఖలో పశువుల నష్టపరిహారం చెల్లింపులో పెండింగ్ క్లెయిముల గురించి చర్చించారు. పశువులకు సమీకృత దాణా రాయితీ సరఫరాపై, పశు బీమా బడ్జెట్ కేటాయింపులపై చర్చించారు. కొత్త పంటల సాగు ప్రోత్సహించాలని, బిందు సేద్య పరికరాలు అవసరమున్న రైతులకు త్వరగా అందేలా చూడాలని కోరారు. సమావేశంలో ఏఓ నరహరికుమార్, ఉద్యానాధికారి శ్రీనివాసులరెడ్డి, పశువైద్యులు శివశ్రీనివాసరెడ్డి, చెన్నారెడ్డి, హబ్ మేనేజర్ విజయలక్ష్మి, మైక్రో ఇరిగేషన్ అధికారి మహేష్ పాల్గొన్నారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ప్రసాదరెడ్డి

కేంద్ర మంత్రిని బర్తరఫ్ చేయాలి

పోరుమామిళ్ల : ఉత్తరప్రదేశ్ లఖింపూర్ జిల్లాలో కేంద్రమంత్రి అజయ్‌కుమార్ మిశ్రా కుమారుడు రైతులను, కార్మికులను, విలేకరులను దుర్మార్గంగా కారుతో తొక్కించిన ఘటనపై కేంద్రమంత్రిని బర్తరఫ్ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు భైరవప్రసాద్ కోరారు.

ముఖ్యమంత్రిగా మళ్లీ జగనన్న రావాలి

ఎమ్మెల్యే రాచమల్లు

రాజుపాళెం : పార్టీల కతీతంగా ప్రభుత్వం చేసిన మంచి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లి తిరిగి రెండోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రావాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన రాజుపాళెంలోని టీటీడీ కల్యాణ మండపంలో మంగళవారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు వచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాచమల్లు మాట్లాడుతూ వచ్చే నాలుగు నెలల కాలంలో ప్రజల వద్దకు వెళ్లి జగనన్న ప్రభుత్వం ద్వారా అందించిన పథకాల గురించి తెలియజేయాలన్నారు. ప్రభుత్వం ద్వారా ప్రతి కుటుంబానికి మేలు జరిగిందని, అందుకు పార్టీ మండల అధ్యక్షుడు గుద్దేటి రాజారాంరెడ్డి, ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీ నుంచి ఇంటింటికి వెళ్లి ప్రజలకు అందిన పథకాలను వివరించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు జీరెడ్డి అంజనీకుమారి, ఎంపీపీ సలోమి, సచివాలయాల కన్వీనర్ వెలవలి శేఖర్ రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఆయా గ్రామాల్లోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : మండల పరిధిలోని కొత్తపల్లె పంచాయతీ కార్యాలయంలో మంగళవారం గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి మాట్లాడుతూ గ్రామంలో ఉన్న సమస్యలను వలంటీర్ల ద్వారా, సచివాలయ సిబ్బంది, ప్రజల ద్వారా తెలుసుకుని వాటి సత్వర పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. రాయలసీమలోనే అతి పెద్ద గ్రామ పంచాయతీ కొత్తపల్లె అని అటువంటి పంచాయతీ అభివృద్ధి పథంలో నడుస్తోందన్నారు. అమృతానగర్‌లో నీటి సమస్య, శానిటేషన్ సమస్య పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. పంచాయతీ సెక్రటరీ గురుమోహన్ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ద్వారా గ్రామ సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషిచేస్తామని చెప్పారు. వార్డు మెంబర్‌లు కొనిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, మోషే, తిరుపాల్ రెడ్డి, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

బద్వేలుకే తలమానికం సెంచురీ ప్యానెల్స్



పనులను పరిశీలిస్తున్న నాగార్జునరెడ్డి

గోపవరం : మండలంలోని పి.పి.కుంట వద్ద నిర్మిస్తున్న సెంచురీ ప్యానెల్స్ పరిశ్రమ బద్వేలు నియోజకవర్గానికే తలమానికమని పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సెంచురీ ప్యానెల్స్ పరిశ్రమను సందర్శించారు. పరిశ్రమలో చేపడుతున్న పనులు, ఎప్పటిలోపు ఉత్పత్తి ప్రారంభిస్తారన్న అంశాలపై పరిశ్రమ జీఎం రమేష్‌కుమార్‌రెడ్డితో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతమైన బద్వేలు నియోజకవర్గంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సెంచురీ ప్యానెల్స్ పరిశ్రమను ఇక్కడ ఏర్పాటు చేయాలన్న ఆలోచన రావడం నియోజకవర్గ ప్రజల అదృష్టమన్నారు. పరిశ్రమ ఏర్పాటుకు ఏడాది క్రితం భూమిపూజ చేయడం, అంతే వేగంగా ప్రభుత్వం నుండి అన్ని వసతులు సమకూర్చడంతో ఈ ఏడాది చివరిలోపే పనులు పూర్తయి ఉత్పత్తిని కూడా ప్రారంభించడం హర్షించదగ్గ విషయమన్నారు. పరిశ్రమకు అవసరమయ్యే కలప ఆధారిత జామాయిల్ చెట్లను రైతులు సాగు చేసుకునేందుకు పరిశ్రమే సబ్సిడీ ద్వారా మొక్కలను అందజేస్తుందన్నారు. ఈ అవకాశాన్ని ఈ ప్రాంత రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రాజోలి జలాశయాన్ని వెంటనే నిర్మించాలి

ప్రొద్దుటూరు : రాజోలి జలాశయం నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని ప్రజాపక్షం అధ్యక్షుడు పుత్తా లక్ష్మీరెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలోని డిప్యూటీ తహసీల్దార్ సతీష్‌కు వినతి పత్రం సమర్పించారు. కుందూనదిపై ఆనకట్ట నిర్మించేందుకు 2008లో శంకుస్థాపన చేశారని, తర్వాత వచ్చిన ప్రభుత్వాలు పనులు ప్రారంభించలేదన్నారు. 2.95 టీఎంసీల సామర్థ్యంతో రూ.1350 కోట్లతో శంకుస్థాపన చేశారన్నారు. ప్రస్తుతం శ్రీశైలంలో నీరు లేక కేసీ కెనాల్ పరిధిలోని పంటలకు నీటిని విడుదల చేయలేదన్నారు. ఆరుతడి పంటలు వేసుకోవాలని అధికారులు ఇప్పటికే సూచించారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే రాజోలి జలాశయాన్ని నిర్మించాలని కోరారు.